క్లుప్తంగా

ప్రజా ప్రయోజనాలకే మైదానం

ఎమ్మిగనూరు: రెండేళ్లుగా ఎమ్మిగనూరులో వివాదాస్పదంగా మారిన వీవర్స్ కాలనీ గ్రౌండ్‌పై హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. మున్సిపల్ లే అవుట్ 105/1947 ప్రకారం వీవర్స్ కాలనీ గ్రౌండ్ కేవలం ఆటస్థలంగా నిర్ధారించబడింది.ఇందులో సొసైటీ వారు ఎలాంటి అక్రమ నిర్మాణాలు,కట్టడాలు చేపట్టరాదు.అలాగే ఇప్పటికే అనధికారికంగా వేసిన షెడ్లను 15 రోజుల వ్యవధిలో తొలగించాలని హైకోర్టు న్యాయమూర్తి సుజాత అక్టోబర్ 30న ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కేసులో ఎమ్మిగనూరు మున్సిపల్ అధికారులు సమగ్ర సమాచారం,ప్రొసిడింగ్స్ చూపడంతో ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి. మున్సిపల్ అధికారుల చర్యల పట్ల పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేడు పగిడిరాయిలో ‘వై ఏపీ నీడ్స్ జగన్’

తుగ్గలి:మండల పరిధిలోని పగిడిరాయి గ్రామంలో మంగళవారం ‘వై ఏపీ నీడ్స్ సీఎం జగన్’ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు జిట్టా నాగేష్ యాదవ్, సచివాలయ మండల కన్వీనర్ హనుమంతు తెలిపారు. ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొనాలని కోరారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కృష్ణగిరి:అమకతాడు టోల్‌ప్లాజాలో పనిచేసే ఉద్యోగులు, కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమిస్తామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి శివరాం డిమాండ్ చేశారు. మండల పరిధిలోని అమకతాడు సమీపంలో జాతీయ రహదారిలోని టోల్‌ప్లాజా వద్ద సోమవారం ఆయన ప్లాజా యూనియన్ నాయకులతో కలి సి సమస్యలపై మేనేజర్ వికాస్ విక్రమ్‌సింగ్‌తో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ టోల్‌ప్లాజాలో కార్మికుల వేతనాలు పెంచి, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. పదోన్న తులు కల్పించాలని కోరారు.జోన్ పట్టణ, మండలాధ్యక్షులు నక్కి శ్రీకాంత్, రామాంజినేయు లు, ప్రజా నాట్యమండలి జిల్లా నాయకులు నాగరాజు, టోల్‌ప్లాజా ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు అయ్యరాజు, రాజశేఖర్,శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణం



నిట్రవట్టిలో జరుగుతున్న సీసీ రోడ్ల పనులు

హాలహర్వి: మండలంలోని నిట్రవట్టి గ్రామంలో సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ‘గడప గడపకు మన ప్రభుత్వం’ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం రూ.20 లక్షలు, ఎంపీపీ నిధులు కింద రూ.8 లక్షలు మంజూరు చేయించారని జెడ్పీటీసీ సభ్యుడు లింగప్ప, ఎంపీటీసీ గోపాల్ సోమవారం తెలిపారు. ఈ మేరకు జరుగుతున్న పనులను వారు సోమవారం పరిశీలించారు.వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాం లోనే గ్రామంలో సీసీ రోడ్లు, డ్రెయినేజీ కాలువలు నిర్మిస్తున్నట్లు చెప్పారు.సీసీరోడ్లు, డ్రైనేజీ నిర్మాణంపై ప్రభుత్వానికి,మంత్రి గుమ్మనూరు జయరాంకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు. సచివాలయ కన్వీనర్ లక్ష్మన్న, పరశురాం,గోవిందు, వీరేష్, మహాలింగ, కాంట్రాక్టర్లు హనుమంతు, శేషప్ప తదితరులు పాల్గొన్నారు.

15న ఉచిత వైద్య శిబిరం

ఎమ్మిగనూరురూరల్: ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీన ఉచిత కంటి, గుండె వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు అసోసియేషన్ సభ్యులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వెనక పెన్షనర్ల కార్యాలయంలో వైద్య శిబిరం ఉంటుందని చెప్పారు.

ఘనంగా అల్లావలి ఉరుసు



అలంకరణలో అల్లావలి దాదా సమాధి

హొళగుంద: దేవరగట్టులో వెలసిన హజరత్ అల్లావలి సాహెబ్ 17వ ఉరుసు ఉత్సవాలు సోమవారం ఘనంగా జరిగాయి. వేడుకలకు ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కుబడులు చెల్లించుకున్నారు. భక్తులు దర్గాల్లో ప్రత్యేక ఫాతెహాలు చేశారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో గంధం, ఉరుసు కార్యక్రమాలతో పాటు సాంస్కృతిక ఇతర కార్యక్రమాలు జరిగాయి.ఉరుసుకు వచ్చినభక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు.

చిన్నారికి రక్తదానం

హొళగుంద: తలసేమియాతో బాధపడుతున్న అల్లారిదిన్నె గ్రామానికి చెందిన భరత్ అనే చిన్నారికి సోమవారం హొళగుంద మండలం ఎల్లార్తి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎస్కే గిరి ఆదోనిలోని ఆదిత్య నర్సింగ్ హోంలో రక్తదానం చేశాడు. ఆ చిన్నారికి 20 రోజుల కోసారి బి నెగటివ్ గ్రూపు రక్తం ఎక్కించాల్సి ఉండగా కుటుంబసభ్యులు గిరిని సంప్రదించారు. ఆయన ఆసుపత్రికి వెళ్లి రక్తదానం చేశాడు. ఆయన ఇప్పటివరకు ఆపదలో ఉన్న పలువురికి 24 సార్లు రక్తదానం చేసి ప్రశంసలు పొందారు.

పల్లె చెంతకే పాలన

- గ్రామాల్లోనే అన్నిరకాల ప్రభుత్వ సేవలు
- ప్రారంభానికి సిద్ధంగా ఉన్న భవనాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామాల ప్రజలు



పెద్దకొత్తిలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న గ్రామ సచివాలయం, ఆర్బీకే, హెల్త్ క్లినిక్ సెంటర్

నందవరం: పాలనలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పల్లె ముంగిటకే పాలన, ప్రభుత్వ సేవలు తెచ్చి గ్రామ స్వరాజ్యం స్థాపించింది. గ్రామీణ ప్రజలకు ఇబ్బందులు లేకుండా ప్రజల చెంతకే సేవలు అందిస్తుతోంది. మొక్కుబడిగా కాకుండా.. ఇతర రాష్ట్రాలు సైతం ఔరా అనేలా గ్రామాల్లో సచివాలయాలు, ఆర్బీకేలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సెంటర్ల నిర్మాణాలు చేపట్టింది. వాటితో పాటు నిరంతర పర్యవేక్షణ సాగించేలా చర్యలు చేపట్టింది. జనన ధ్రువీకరణ పత్రంతో పాటు స్థలాల రిజిస్ట్రేషన్ వంటి సేవలతో సచివాలయాల ద్వారా దాదాపు 550 సేవలు అందుబాటులోకి తెచ్చింది. అలాగే 104, 108, ఫ్యామిలీ డాక్టర్ విధానంతో దీర్ఘకాలిక రోగులకు ఇంటి వద్దకే వైద్య సేవలు, దీంతో పాటుగా గ్రామాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్లను ఏర్పాటు చేయడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇంటి వద్దకే సేవలు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామ సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థలతో లబ్ధిదారులకు ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందుతున్నాయి. పింఛన్ల పంపిణీ నుంచి కుల, ఆదాయ, బర్త్, రేషన్ కార్డు తదితర సేవలు ప్రజలకు మరింత చేరువయ్యాయి. అలాగే ఆర్బీకేల ద్వారా రైతులకు అన్ని రకాల సేవలు అందుతున్నాయి. విత్తు విత్తిన ప్పటి నుంచి పంట చేతికి అందే వరకు ఆర్బీకే సిబ్బంది ప్రతి దశలో సహకారం అందిస్తున్నారు. నాణ్యమైన ఎరువులు, విత్తనాలతో పాటు పంటల బీమా, రైతు భరోసా, పంటల నమోదు, గిట్టుబాటు ధరలు వంటి సేవలను అన్నదాతలు పొందుతున్నారు. అలాగే గ్రామాల్లో దీర్ఘకాలిక రోగులకు ఇంటి వద్దకే మెరుగైన సేవలు అందుతున్నాయి. పల్లెలో ప్రజలకు స్పెషలిస్టు డాక్టర్లతో వైద్య సేవలతో పాటు మందులు పంపిణీ చేస్తున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో గ్రామ సచివాలయం నిర్మాణానికి రూ.40 లక్షలు మంజూరు చేసింది. రైతు భరోసా కేంద్రానికి రూ.21.80 లక్షలు, హెల్త్ క్లినిక్ సెంటర్‌కు రూ.17.50 లక్షలు విడుదల చేసింది. శరవేగంగా భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. దేశంలో ఎక్కడా జరగని విధంగా అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ దూసుకుపోతోంది. గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థతో పల్లెల్లో ప్రజల వద్దకే పాలనతో పాటు సేవలు చేరువయ్యాయి.

నందవరం మండలానికి మంజూరైన భవన నిర్మాణాల వివరాలు

కార్యాలయాలు	మంజూరైన భవనాలు	మంజూరైన సొమ్ము
గ్రామ సచివాలయాలు	19	రూ.7.60 కోట్లు
రైతు భరోసా కేంద్రాలు	19	రూ.4.14 కోట్లు
విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్లు	15	రూ.2.62 కోట్లు
మొత్తం	53	రూ.14.36 కోట్లు

త్వరలో ప్రారంభిస్తాం



నిర్మాణం పూర్తయిన గ్రామ సచివాలయాలు, ఆర్బీకే, హెల్త్ క్లినిక్ సెంటర్ల భవనాలను త్వరలో ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తాం. పల్లెలో సచివాలయ వ్యవస్థతో పాటు రైతు భరోసా కేంద్రం ద్వారా విస్తృత సేవలు అందిస్తున్నాం. పింఛన్ల పంపిణీ నుంచి కుల, ఆదాయ, బర్త్, డెత్, మ్యుటేషన్, రేషన్ కార్డు మార్పులు, చేర్పులు, తొలగింపు వంటి సేవలు లబ్ధిదారుల ఇంటి వద్దకే చేరవేస్తాం. అలాగే రైతులకు రైతు భరోసా, పంట బీమా, పంట కొనుగోలు, గిట్టుబాటు ధరలతో పాటు తదిరత సేవలు అందుతున్నాయి. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా గ్రామ సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్నారు.
– దశరథ రామయ్య, ఎంపీడీఓ, నందవరం

చిరుత కలకలం

తుగ్గలి: మండల పరిధిలోని పెండేకల్లు, ఎద్దుల దొడ్డి సమీపంలోని కొండ, గుట్టల్లో చిరుత సంచరిస్తున్నట్లు ప్రచారం కలకలం రేపుతోంది. సోమవారం సాయంత్రం ఆయా గ్రామాల సమీపంలోని కొండల్లో సంచరి స్తున్న చిరుతను చూసి గొర్రెల కాపరు లు,రైతులు ఆందోళనకు గురయ్యారు. ఈ విషయంపై గొర్రెల కాపరులు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ లక్ష్మన్నకు సమాచారం అందించారు. ప్రజలెవరూ భయాందోళన చెందవద్దని అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. వ్యవసాయ పనులు, జీవాలు మేపేందుకు వెళ్లినప్పుడు మాట్లాడుకుంటూ,కర్ర చప్పుడు చేస్తూ వెళ్లాలని సూ చించారు.చిరుత కనిపిస్తే 8688467597 నంబర్‌కు ఫో న్ చేసి సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

నేడు గూళ్యంలో మంత్రి పర్యటన

హాలహర్వి:మండలంలోని గూళ్యం గ్రామ సచివాలయం-1 పరిధిలో మంగళవారం జరిగే ‘వై ఏపీ నీడ్స్ జగన్’ కార్యక్రమంలో రాష్ట్ర కార్మికశాఖ మంత్రి గుమ్మనూరు జయరాం పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ భీమప్పచౌదరి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటారని చెప్పారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం వైఎస్ జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిన ఆవశ్యకతను వివరిస్తారన్నారు. అన్నిశాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయంతం చేయాలని పిలుపునిచ్చారు.

మద్దమాంబకు కరెన్సీ నోట్ల అలంకరణ



మద్దికెర: మండలంలో ప్రసిద్ధి చెందిన మద్దమాంబ అమ్మవారికి సోమవారం అమావాస్య సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. దీపావళి అమావాస్య పురస్కరించుకొని అమ్మవారిని కరెన్సీ నోట్లతో అలంకరించారు. అలాగే అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి ఇచ్చారు. పూజలకు విచ్చేసిన భక్తులకు ప్రసాదం వినిమయం చేశారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



కృష్ణగిరిలో లబ్ధిదారురాలికి సంక్షేమ క్యాలెండర్ అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కృష్ణగిరి: రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు జయరామిరెడ్డి, నారాయణ అన్నారు. కృష్ణగిరిలో సోమవారం ‘ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు మళ్లీ సీఎం కావాలి’ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరుగుతూ వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టో అమలుపై ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించి సంక్షేమ క్యాలెండర్లను అందజేశారు. జగనన్న పాలనలో పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించారన్నారు. ప్రతి గ్రామ సచివాలయానికి నిధులు మంజూరు చేసి అభివృద్ధి పనులు చేస్తున్నట్లు వెల్లడించారు. సంక్షేమం, అభివృద్ధి అందించే ముఖ్యమంత్రి కావాలా? 14 ఏళ్ల పాలన చేసి రాష్ట్రాన్ని దోచుకున్న వ్యక్తి కావాలా? ప్రజలు ఆలోచించుకోవాలన్నారు. నాయకులు హుసేన్‌సాహెబ్, జింకల చిన్నన్న, బాలమద్ది, సుంకన్న, సత్యం తదితరులు పాల్గొన్నారు.

వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

గోనెగండ్ల: వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించి, హెచ్‌ఆర్ పాలసీ వర్తింపు, కనీస వేతనం రూ.26 వేలు ఇచ్చి, సీనియర్ వీఓఏలకు సీసీలుగా పదోన్నతి కల్పించాలని ఆ యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రభుదాస్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి రవికుమార్ అధ్యక్షతన వీఓఏల యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రభుదాస్, జిల్లా అధ్యక్షుడు బసవరాజు మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వీఓఏలకు ప్రతినెలా గౌరవ వేతనం చెల్లించడం అభినందనీయమన్నారు. అనంతరం నూతన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఆరెకల్ రవికుమార్, ఉపాధ్యక్షులుగా మిన్నల్లాతో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. సంఘం జిల్లా కోశాధికారి పద్మావతి, కడప జిల్లా కార్యదర్శి నాగరాజు, జిల్లా గౌరవ సలహాదారు రామలింగప్ప, ఆయా మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఏబీవీపీ బాగ్ కన్వీనర్ నియామకం

ఎమ్మిగనూరురూరల్: ఏబీవీపీ ఎమ్మిగనూరు బాగ్ కన్వీనర్‌గా జి.కార్తీక్ ఎంపికయ్యారు. సోమవారం నూతన కన్వీనర్ జి .కార్తీక్ మాట్లాడుతూ డోన్ పట్టణంలో ఈ నెల 10, 11 తేదీల్లో జరిగిన విభాగ్ అభ్యాస వర్గ సమావేశంలో తనను ఎన్నుకున్నట్లు చెప్పారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు. విద్యార్థుల సమస్యలపై పోరాటం చేస్తానని పేర్కొన్నారు.

ఘనంగా ఆరాధనోత్సవాలు





దైవ వచనాలను ప్రభోదిస్తున్న గుడికల్ దర్గా పీఠాధిపతులు, ఆరాధనోత్సవాల్లో పాల్గొన్న భక్తులు

వెల్దుర్తి(కృష్ణగిరి): సర్వమతాల సారాంశం శాంతి, సమానత్వమే అని ఎమ్మిగనూరు మండలం గుడికల్ దర్గా పీఠాధిపతులు, తండ్రీ కుమారులైన గాజా హుసేన్‌పీరా స్వామి, హమీద్ ప్రభోదించారు. స్థానిక అల్లీపీరా స్వామి భజన మందిరంలో గత రెండ్రోజులుగా సద్గురు హుసేన్‌పీరా స్వామి ఆరాధనోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఏపీ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి తరలివచ్చిన వేలాది భక్తులు స్వామి వారి ఆరాధనలో తన్మయత్వం పొందారు. ఉత్సవాలలో భాగంగా ఆదివారం రాత్రి స్వామి వారి గంధోత్సవం వైభవంగా జరిగింది. స్థానిక సన్నతి సుబ్బయ్య మనుమడు రాజశేఖర్ గంధం తలకెత్తుకుని పట్టణ పురవీధుల గుండా సాగగా వేలాది భక్తులు వెంట నడిచారు. పీఠాధిపతి హమీద్ అనుసరించగా పట్టణవాసులు నీరాజనాలు పలికారు. ఆదివారం రాత్రి అన్ని ఘడియలు, సోమవారం మధ్యాహ్నం దాటేంతవరకు పీఠాధిపతుల ప్రవచనాలు కొనసాగాయి. నిర్వాహకులైన స్థానిక గురుకుల కమిటీ కార్యవర్గ సభ్యులు మేఘనాథ రెడ్డి, నారాయణ, ఓమేంద్రబాబు, కామేశ్వరయ్య, శాంతమ్మ భక్తులకు సౌకర్యాలు కల్పించడంతోపాటు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

ఆశాజనకంగా కంది పంట



బాపనదొడ్డి సమీపంలో పూతతో కళకళలాడుతున్న కంది పంట

కృష్ణగిరి: పంట ఎండుతున్న సమయంలో వరుణుడు కరుణించడంతో కంది పంట సాగుచేసిన రైతన్నల కళ్లలో ఆనందం వెల్లివిరుస్తోంది. గతేడాది అధిక వర్షంతో నష్టాన్ని మిగిల్చిన కంది పంట ఈ యేడాది అరకొర వర్షాకే ఏపుగా పెరిగి కళకళలాడుతోంది. మండలంలోని అన్ని గ్రామాల్లో దాదాపుగా 4 వేలకు పైగా ఎకరాల్లో కంది పంటను సాగుచేసినట్లు అధికారులు తెలిపారు. వారం రోజుల క్రితం కురిసిన వర్షాలకు కంది పంటకు పూత మంచిగా వచ్చింది. అలాగే పురుగు ఉధృతి కూడా తక్కువగా ఉందని, పంటను కాపాడుకుంటే మంచి దిగుబడి పొందవచ్చని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మరో 10 రోజుల్లో ఒకసారి వర్షం పడితే పదును అయితే, ఈ ఏడాది కందులకు మార్కెట్లో మంచి ధర ఉండటంతో లాభాలు పొందవచ్చని రైతులు ఆశతో ఎదురుచూస్తున్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



మాట్లాడుతున్న జిల్లా జేసీఎస్ కన్వీనర్ తెర్నేకల్ సురేందర్‌రెడ్డి

దేవనకొండ: రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే సీఎం జగనన్న ధ్యేయమని వైఎస్సార్‌సీపీ జేసీఎస్ జిల్లా కో–ఆర్డినేటర్, అసెంబ్లీ పరిశీలకులు తెర్నెకల్ సురేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం తెర్నెకల్ ఆయన గృహ ప్రవేశ కార్యక్రమానికి జిల్లాలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇప్పటివరకు ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. సంక్షేమ పాలన కొనసాగేందుకు వచ్చే ఎన్నికల్లో మరోసారి జగనన్నకు ప్రజలు ఓటు వేసి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. మాజీ సీఎం చంద్రబాబునాయుడు చేసిన అక్రమాలు ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయన్నారు. ఆరోగ్య సమస్యలతో బెయిల్‌పై బయటకు వచ్చిన ఆయన మళ్లీ జైలుకు వెళ్లక తప్పదని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కప్పట్రాళ్ల బొజ్జమ్మ, పంచాయతీరాజ్ విభాగం జోనల్ ఇన్‌చార్జ్, చిప్పగిరి జెడ్పీటీసీ సభ్యుడు విరుపాక్షి, పంచాయతీరాజ్ వింగ్ జిల్లా అధ్యక్షుడు అరుణ్‌కుమార్, సర్పంచులు వెంకటరెడ్డి, నాగిరెడ్డి, అరుణ్‌కుమార్, మాజీ ఎంపీపీ రామచంద్రనాయుడు, నాయకులు వెంకటరామిరెడ్డి, శివారెడ్డి, వీరన్న, రామకోటిరెడ్డి, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద బీమా అందజేత



రూ.2 లక్షల మెగా చెక్కును అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు పి.మురళీధర్‌రెడ్డి

పత్తికొండ రూరల్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తెర్నేకల్ హుసేన్‌సాబ్ కుటుంబ సభ్యులకు సేవాదళ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు పి.మురళీధర్‌రెడ్డి సోమవారం రూ.2 లక్షల చెక్కును అందజేశారు. సేవాదళ్‌లో సభ్యత్వం తీసుకున్న వారందరికీ ఆయన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ జన్మదినం సందర్భంగా ఇన్సూరెన్స్ చేయించారు. స్థానిక ముస్లిం వీధికి చెందిన కార్పెంటర్ హుసేన్‌సాబ్ కనకదిన్నె గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆ కుటుంబానికి మంజూరైన రూ.2 లక్షల చెక్కును మృతుడి భార్య జహెరాబీకి అందజేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. నాయకులు కోటేశ్వరరావు, మస్తాన్‌సాహెబ్, టైలర్ లాలు తదితరులు ఉన్నారు.

నేడు ‘జగనన్నకు చెబుదాం–స్పందన’ కార్యక్రమం

హాలహర్వి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ‘జగనన్నకు చెబుదాం–స్పందన’ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఆంతోని సోమవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజల సమస్యలపై వినతులు స్వీకరిస్తామన్నారు. అన్నిశాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.

మిరపలో సస్యరక్షణ చర్యలు పాటించాలి

గోనెగండ్ల: మండలంలో మిరప సాగుచేసిన రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఎమ్మిగనూరు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్. మహమ్మద్ ఖాద్రి, గోనెగండ్ల ఏఓ హేమలత రైతులకు సూచించారు. సోమవారం గోనెగండ్లలో మిరప పంటలను పరిశీలించారు. మిరప పంటను తామర పురుగు, పచ్చ రబ్బరు పురుగు, కొంచెం బూడిద తెగులు సోకినట్లు గమనించామన్నారు. తామర, పచ్చ రబ్బరు పురుగు నివారణకు ఫ్లక్సా మెటమైడ్ 16 మి.లీ./20 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. అలాగే బూడిద తెగులు నివారణకు అజాక్సీ స్ట్రోబిన్ 10 మి.లీ./20 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలని చెప్పారు. ఈ పురుగు, తెగులును పూర్తిగా అదుపు చేసేందుకు బవేరియా, వర్టిసీలియం, సూడో మోనాస్ ఒక్కోటి 100 మి.లీ./20 లీటర్ల నీటిలో కలిపి అందులోనే ప్రతి ట్యాంకుకు 200 గ్రాముల బెల్లం ద్రావణం పోసి, ప్రతి రసాయన మందు స్ప్రే తరువాత 4 రోజులకు ఈ జీవ క్రిమినాశనుల పిచికారీ చేయాలని సూచించారు.

హిందూ ధర్మంపై ప్రచారం

కృష్ణగిరి: మండల పరిధిలోని కటారుకొండ గ్రామంలో సోమవారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి డోన్ కమిటీ అధ్యక్షుడు నాగరాజు ఆధ్వర్యంలో హిందూ ధర్మ ప్రచార కార్యక్రమం చేపట్టారు. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాల గురించి ప్రచారం చేశారు. ప్రతి శరీరంలో కార్మికుడిగా, కార్యకర్తగా ఆత్మ శక్తి దాగి ఉందని తెలుసుకోవాలన్నారు. కమిటీ సభ్యులు నాగేంద్ర, శివకుమార మల్లీశ్వరి, లీలావతి తదతరులు పాల్గొన్నారు.

బస్టాండ్ మధ్యలోనే బైకులు



హొళగుంద బస్టాండ్‌లో వాహనాలను అడ్డదిడ్డంగా నిలిపిన దృశ్యం

హొళగుంద: మండల కేంద్రం హొళగుంద బస్టాండ్‌తో పాటు కోటవీధి, సులువాయి రోడ్డులో రోజురోజుకు ట్రాఫిక్ సమస్య పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దుకాణాలు, ఇతర వ్యాపార సముదాయాలు పెరగడం, బస్టాండ్ స్థలంలో మోటర్ సైకిళ్లు ఇతర వాహనాలు నిలపడం వల్ల ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. రాత్రి సమయంలో ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలు, మోటార్ సైకిళ్ల రద్దీ పెరగడంతో ప్రజలు రాకపోకలకు పలు అగచాట్లకు గురౌతున్నారు. ఇక మహిళలు తీవ్ర ఇబ్బందికర పరిస్థితి ఎదుర్కొంటున్నారు. ఏదైనా కొనేందుకు దుకాణాల వద్దకు వెళ్లాలంటే వాహనాలను దాటుకుని వెళ్లాల్సి వస్తోందని, సమస్యను ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులు వెంటనే స్పందించి ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

బాలికలు ఉన్నతంగా రాణించాలి



నందవరం కేజీబీవీలో దీపావళి వేడుకల్లో పాల్గొన్న సీఐ మోహన్‌రెడ్డి

నందవరం: బాలికల చదువు భవిష్యత్తు తరాలకు వెలుగునిస్తుందని ఎమ్మిగనూరు రూరల్ సీఐ మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాల విద్యార్థినులకు దీపావళి పండుగ సందర్భంగా బాణసంచా పంపిణీ చేశారు. అనంతరం దీపావళి వేడుకలను ప్రిన్సిపాల్ శైలజ ఆధ్వర్యంలో విద్యార్థినులతో కలిసి జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలికలు చదువుపై శ్రద్ధ పెట్టి ఉన్నతంగా రాణించాలన్నారు. ఇష్టంతో చదివి ఉన్నత స్థానాలను అధిరోహించాలన్నారు. తల్లిదండ్రులు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలన్నారు. ఎస్ఐ తిమ్మయ్య, పోలీసు సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

అభయాంజనేయుడికి ప్రత్యేక పూజలు

పత్తికొండ రూరల్: పత్తికొండ–కర్నూలు రోడ్డులో కొలువైన అభయాంజనేయ స్వామికి సోమవారం అమావాస్య సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు రవి స్వామివారికి జలాభిషేకం, సహస్రనామార్చన, కుంకుమార్చన తదితర పూజలు శాస్త్రోక్తంగా చేశారు. ఆలయ నిర్వాహకులు మధ్యాహ్నం భక్తాదులకు అన్నదానం ఏర్పాటుచేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వ్యక్తి మృతి

ఆలూరు: ఆర్థిక సమస్యలతో ఒత్తిడికి గురై వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. ఆలూరుకు చెందిన బజారప్పకు ఇద్దరు సంతానం. పెద్ద కుమారుడు సుంకన్న వివాహం అనంతరం కూలీపనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సుంకన్నకు (40) భార్య శ్రీదేవి, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుటుంబ పోషణకు కొంతమేర అప్పులు చేశారు. అప్పులను తీర్చే మార్గం లేకపోవడంతో మనోవేదనకు గురై మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ఆస్పరి: ఆస్పరిలోని లైబ్రేరీలో మంగళవారం నుంచి ఈనెల 20వ తేదీ వరకు 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు లైబ్రేరియన్ విశ్వనాథరెడ్డి సోమవారం తెలిపారు. ఈనెల 14న గ్రంథాలయాల వారోత్సవాల ప్రారంభం, 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖులను స్మరించుకోవడం, 17న విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, 18న చిత్రలేఖనం, 19న మహిళా దినోత్సవం, 20న వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. పాఠకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

కృష్ణగిరి: స్థానిక గ్రంథాలయంలో మంగళవారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకు గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు లైబ్రేరియన్ తోటమ్మ సోమవారం తెలిపారు.

గద్వాల సోమన్నను వరించిన ‘బాలసాహిత్య రత్న’



ప్రతిబింబాలు పుస్తకావిష్కరణ గావిస్తున్న దృశ్యం

పెద్దకడబూరు: మండలంలోని కంబదహాల్ ప్రాథమికోన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడుగా పని చేస్తున్న ప్రముఖ బాలసాహిత్యవేత్త, బాలబంధు గద్వాల సోమన్నను బాలసాహిత్యరత్న బిరుదు వరించింది. మహర్షి వాల్మీకి సాంస్కృతిక సాహితీ సంస్థ అధ్యక్షుడు, విశ్రాంత భూగర్భ గనుల శాఖ అధికారి డాక్టర్ వీ.డి.రాజగోపాల్ హైదరాబాద్‌లో ఆదివారం బిరుదును ప్రదానం చేశారు. అలాగే ఆయన రచించిన 42వ కొత్త పుస్తకం ప్రతిబింబాలు బాలగేయాల సంపటి పద్మశ్రీ కొలకలూరి ఇనాక్, రిటైర్డ్ ఫారెస్ట్ ఆఫీసర్ ఏఎల్ కృష్ణారెడ్డి, బిక్కి కృష్ణ, నాళేశ్వరం శంకరం, రాజా వాసిరెడ్డి మళీశ్వరి చేతుల మీదుగా అవిష్కరించారు. అనంతరం గద్వాల సోమన్నను సత్కరించారు.